# గుళికలు
## రమానాథ్ కందాళ





**గుళికల గురించి**

| | |
|---|---|
| కుదురు రోగము: | అపూర్వ ప్రయోగములైనందున అనిర్ధారితము. |
| పదార్థములు - పాళ్ళు: | మీకు తెలిసిన మాకు తెలియచేయ మనవి |
| వాడకము: | నెలకో గుళిక |
| వాడుక సూచన: | గొంతునకడ్డము పడకుండ మింగవలెను. |
| హెచ్చరిక: | వికటించవచ్చు. వ్యసనలోలత కి అవకాశమున్నది. |

## ఆత్మకథ

ఇది జరిగి కొన్నాళ్ళైంది. నేనిప్పుడు చెప్ప బోయేవి తన స్వయానా నాతో అన్న మాటలు. కల్పన అవసరం లేదు. అవసరం లేని కల్పన అందం చెడగొడుతుంది. తనకీ నాకూ పూర్వ పరిచయం పెద్దగా ఏం లేదు. అవసరార్థం ఆ రాత్రి కలవాల్సి వచ్చింది. నేను వెళ్ళేసరికి తను సిద్ధంగా ఉంది.

"ఏడీ రాముడు? లోపలున్నాడా?" అన్నాను.

"నిద్ర పోతున్నాడు". వాడి ప్రసక్తి కూడా తనకి ఇష్టం లేనట్టుంది.

లోపలనుంచి చిన్నగా గురక వినిపిస్తోంది. తను ఆ శబ్దం భరించలేనట్టు "ఇక నేను వెళ్ళాలి" అంది.

తను ఆ రాత్రి వాణ్ణి వదిలి వెళిపోతోంది.

"సరే" అన్నాను.

తను వెళ్ళబోతూ నా వైపోసారి చూసి "జాగ్రత్త" అంది.

"సరే"

"కాదు.. నిజంగా జాగ్రత్త. వీడితో కత్తిమీద సాము."

ఉత్తి జాగ్రత్తేమో అనుకున్నాను కానీ ప్రత్యేక హెచ్చరికలా ఉంది. అపరిచితుల్ని కూడా హెచ్చరిస్తున్నామంటే ఆపద ఘనమైంది కావాలి.

"ఏం?" అన్నాను.

"వీడిదో దయ్యాల కొంప"

"దయ్యాలా.. నీకెలా తెలుసు?" దయ్యాలుండడం కన్నా అవి ఉన్నట్టు తనకెలా తెలిసిందో అన్న దాని మీద నాకు కుతూహలం కలిగింది.

"దయ్యాలంటే దయ్యాలు కాదు .. దయ్యాల్లాంటివి"

నా ప్రశ్న తనకెక్కినట్టులేదు. దయ్యాలే కానక్కర్లేదు, భూత ప్రేత పిశాచ శాఖినీ ఢాకినీ శాఖల్లో తను దేన్నుదహరించినా కూడా నా ప్రశ్న అలానే ఉండేది. తన జవాబూ అలానే ఉండేదేమో.

"ఆ దయ్యాలాడించినట్టల్లా ఆడ్డం, పైగా మాంత్రికుళ్ళా తనే వశపరుచుకోని వాటినాటాడిస్తున్నట్టు నాతో వాదించడం"

"ఎప్పణ్ణుంచి ఇదంతా?" అన్నాను.

"తనకి జ్ఞానం తెలిసిన దగ్గర్నుంచని తనంటాడు. ఉన్న జ్ఞానం పోయిన దగ్గర్నుంచని నేనంటాను. అటువంటి జ్ఞానం పోయినా పరవాలేదని తనంటాడు."

నాకర్థవైంది వాళ్ళ అన్యోన్యత. చెడ్డదంటే చెడదూ మరి. ఎడ్డెం అంటే తెడ్డెం అనే కాపురం చెడకపోతే చెప్పుకోవాలి. తను చెప్పుకుపోతోంది.

"ఉండాల్సిందే అటువంటి జ్ఞానం అని నేనేనంటాను. తనొప్పుకోడు. ఎవరు చెప్పారేం? ఎవడో చెట్టుకింద కళ్ళుమూసుకుని కన్నదల్లా జ్ఞానవే, మనకది ఉండాల్సిందే అంటే నాకు ఒప్పుకోబుద్ధికాదు అని రెట్టిస్తాడు."

విడిపోతున్నారంటే ఏదో సంసారపు గొడవలనుకున్నాను. కానట్టుంది. సంసారంలో రగడకి అంతా ఎరిగున్న కారణాలు వేరు. జ్ఞానం లాటి అజ్ఞాత కారణం ఇదే మొదటిసారిగా వినడం. ఆమాటే అంటే తను,

"ఒక్క జ్ఞానవేనేవిటి.. తప్పూ, ఒప్పూ, నీతీ, నియమం, ధర్మం, ఆచరణా, అరిషడ్వర్గాలూ, అపవర్గం, దేవుడూ, మతవూ, వీటిల్లో వేటి మీదా ఖచ్చితం లేదు మనిషికి. వట్టి అనుమానప్పురుగు. ఆమాటకేవన్నాడో తెలుసా.. ఆ! నువ్వెక్కళ్ళే .. గాల్లో ఓ గీత కొట్టేసి ఇటు వైపుది చెడ్డగాలి, అటువైపుది మంచిగాలి అని విభజన చేయగలవు, చెయ్యాపి చెడ్డగాల్ని గుప్పిట్లో చిక్కించుకోగలవు, నీకా సూత్రాలన్నీ రాసిపెట్టున్నాయి, అన్వయానికీ అనుమానంలేదు, అమలుకీ అనుమానంలేదు. నా అనుమానానికి సర్వ బాధ్యతలూ నావే. దాని పాలనా పోషణా నివృత్తీ అన్నీ నావే. నీ పిచ్చులు నువ్వు దేవుడికంటకడతావు... నా అనుమానం వల్ల బాగుపడింది లేకపోతే పోయె.. కానీ నీ పిచ్చులు కార్చిచ్చుల్లా వ్యాపించి తాకిందల్లా తగలేసిందనడానికి లక్ష ఉదాహరణలు.. నేననుమానప్పురుగునైతే నువ్వో ఖచ్చితప్పిచ్చిముండవి అన్నాడు చెప్పుతో కొట్టినట్టు."

*సారాంశం..*

ఇహ పరాలకి సంబంధించినదేదవనీండి.. వాటిల్లో ప్రతీ దానిమీద తనకేమో బిగువు సడలని సూత్రాలున్నాయ్. వాట్ని నోరెత్తకుండా పాటించాలంటుంది. అనుమానప్పొడ గిట్టదు. భగవానువాచ, పాటించుము తప్పక తు.చ. అంటుంది. కావులిస్తే ఉవాచలన్నీ ఉన్నపళంగా వల్లించి చెపుతుంది. కాదన్డానికి కంఠం పెగ్గిలాదు మామూలు వాడికైతే. కానీ వాడు మామూలు వాడు కాట్ట. తనింకా చెప్పుకుపోతోంది.

"ఇంతకుముందోసారి గట్టిగా నిలదీసి నా పద్ధతులంటే నీకెందుకింత ద్వేషం అన్నాను. ద్వేషవా?.. ఎందుకూ ద్వేషం.. ద్వేషానిక్కూడా నిశ్శంక కావాలి. అనుమానవున్నవాడు ద్వేషించలేడు: అని గీతలో కృష్ణుళ్ళా నవ్వేడు. ఏం చెయ్యాలి?"

నిప్పు తొక్కిన కోతిలా తను గెంతిన కొద్దీ వాడు నిమ్మకు నీరెత్తినట్టుంటాట్ట. తను శిశుపాలుళ్ళా రెచ్చిన కొద్దీ వాడు వక్కలు లెక్కిస్తూన్న కృష్ణుళ్ళా కూచుంటాట్ట. కంఠశోషొచ్చి తను కింద పడిపోవలసిందే కానీ వక్కలు బస్తాల కొద్దీ తెప్పించుకుని మరీ

లెక్కపెట్టగలట్ట. లెక్క మానడు, చక్రం వొదలడు. సమస్య కాదూ. నాకు జాలి వేసింది. "పోనీ.. బతిమాలో.. ఏదో చేసి.." నేనింకా పూర్తి చెయ్యలేదు.

"అదీ అయింది.. ఎన్ని సార్లు గెడ్డం పట్టుకోలేదు. బాబ్బాబని బతిమాలేను. లక్షల కోట్ల మంది నడిచేరు, నడుస్తున్నారు నేనంటూన్న మార్గంలో, నువ్వు కూడా నడవరాదూ.. అంటే ఏవన్నాడో తెలుసా?.. నువ్వు చెప్పిందివింటే నీవంటూన్న మార్గం మహారద్దీగా కనబడుతోంది. ముందువాడి వీపు తప్ప మరోటి కనిపించదు, అదీ కళ్ళు విప్పితే. వాడు వెళ్ళివెళ్ళి గోతిలో పడితే వెనకాడ్డానిక్కూడా కుదరదు. ఎందుకంటే ఈలోపుల నీ వెనకవాడు నిన్ను తోసుకుంటూ వొచ్చేస్తాడు. ఇద్దరూ కలిసి గోతిలో పడతారు, అన్నాడు . ఇంకేం చెప్పాలీ మనిషికి?"

అవును ఏం చెప్పాలి? ఒక్కోసారి నోరు మెదులుతుంది కానీ ఏం చెప్పడానికీ ఉండదు. అయినా చెప్తాం. మన నమ్మకాల మీద మనకున్న విశ్వాసం అటువంటిది. అది బుద్ధికీ వాక్కు కీ ఉన్న లంకెని శాసిస్తుంది. తనది మహామహులు మలచిన బాట అన్నదిట. మరోబాట మలిచి వాడు మహామహుడు కాబోడం తనకి అసూయా అనడిగేట్ట. అహంకారపడకు అన్నదిట. అధైర్యపడకు అన్నాట్ట. తనది నలిగినబాట అన్నదిట. ఎవరూ నడవకపోతే ఎలా నలుగుతుందీ అన్నాట్ట. ఇలా వాగ్ద్వంద్వయుద్ధం జరిగి జరిగి చివరకి తను, 'ఇది దేవుడు చెప్పిన మార్గం, దీని చివర దైవసాన్నిధ్యం లభిస్తుంది', అన్నదిట.

ఆమాటకి వాడోక్షణం ఊరుకుంటే తన్మాత్రపడింది, తగలాల్సినచోట తగిలుంటుంది, ఇంకేం పెగుల్తుందిలే అని. వాడు తాపీగా, 'చెప్పేవు కాదేం .. నిక్కర్ల రోజుల్నుంచీ నీ ప్రకారం నిషిద్ధప్పనులు చేస్తున్నవాణ్ణి. దేవుడి చరిత్రని చూస్తే నాలాటివాళ్ళ కోసం ప్రత్యేక మార్గం వేసుకుని తనొచ్చినట్టే ఉంది తప్ప నేను తనకోసం పోయినట్టు లేదు, నాకోసం తనే వస్తాళ్ళే. నేను పోవడం ఎందుకు? ' అన్నాట్ట.

"మేవిద్దరం భేదించని విషయంవంటూ ఉంటే కనక అదున్నట్టు మేం ఎరక్క పోబట్టేను. నిత్యం భేదిస్తూ కూడా కలిసుండగలగడం కత్తిమీద సాము లాటిది. తెగే వరకేను. ఆ తెగడం తెగడం వాడలా అనడంతో కసుక్కున తెగింది. ఈ మొండి వెధవతోనా నేనిన్నాళ్ళూ జత కలిపింది?.. రాడూ మరి దేవుడు?.. స్థంభాలు పగలగొట్టుకుని మళ్ళీమళ్ళీ వస్తాడు... మంచీ, చెడ్డా, భయం, భక్తీ వీడి మొహాన గోళ్ళతో సందేహం లేకుండా గీకి మరీ పోతాడు. వీడితో జత ఇక దుస్సహం. అందుకే వదిలి పోతున్నాను." అంది తను.

అవసరాన్ని బట్టి అవతారం. అదే కద ఉవాచగా రాసున్నది. ఇంతకీ నాకెందుకు. తను వెళ్ళిపోతాననంటే ఆపడానికి నేనెవర్ని? తను వెళ్ళడానికి ఆయత్తమవుతూ "వస్తాను. జాగ్రత్త! అన్నట్టు నీ పేరూ.. గుర్తుకు రావట్లేదు.." అంది. పని సందట్లో పేర్ల సంగతి ప్రస్తావనకి రాలేదు.

"నా పేరా.. నా పేరు సంశయాత్మ అంటారు" అన్నాను.

"సంశయాత్మా?.... వీడికి తగ్గ జతవే. సంశయాత్మా వినశ్యతి.. మీ కర్మ" అంది ఖచ్చితాత్మ పైకెగిరిపోతూ.

ఖచ్చితాత్మకేం బెంగ లేదు. ఇవాళా రేపూ తనకి కావలసిన రాముళ్ళు కోకొల్లలు. క్షణంలో తనకి మరో జత దొరుకుతుంది. సంశయాత్మల బతుకే మరీ తాడూ బొంగరం లేకుండా ఉంది. నేను నిశ్శబ్దంగా లోపలికెళ్ళి చూసేను. రాముడు మత్తుగా ఏదో పలవరించి ఓ సారి పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు. చడీ చప్పుడూ లేకుండా నేను వాళ్ళో దూరేను. మర్నాడు వాడు నిద్రలేచి ఒళ్ళు విరుచుకుంటూ ఈ మధ్యకాలంలో ఇంత సుఖనిద్ర పోలేదు, ఇట్టే తెల్లారింది అనుకున్నట్టు గుర్తు.